

ధ్వజారోహణం..దేవతాహ్వానం
పాతగుట్ట నృసింహుడి ఆలయ బ్రహ్మోత్స వాల్లో భాగంగా ధ్వజారోహణం నిర్వహించి దేవతలకు ఆహ్వానం పలికారు. - 8లో



అక్రమ నిర్మాణాల కూల్చివేత
చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ బృందం కూల్చివేసింది. - 8లో



ఘనంగా దోపోత్సవం
చెర్వుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దోపోత్సవం నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

ఆరోగ్య సంరక్షణకు కృషి



కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ గురించి వివరిస్తున్న వికాస్ భాటియా

బీబీనగర్: రోగుల అవసరాలు తీర్చడంలో ఎయిమ్స్ నిబద్ధతతో పని చేస్తూ, వారి ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తోందని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. మంగళవారం ఎయిమ్స్ వైద్య కళాశాలలో ఈఎన్‌టీ, తల, మెడ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో శ్రవణ పునరావాసం అనే అంశంపై నిర్వహించిన కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రవణ పునరావాస రంగంలో వ్యూహాలు, పురోగతిని అన్వేషించడానికి వైద్య నిపుణులను ఒకే వేదికపై చేర్చి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా వినికిడి లోపం ఉన్న వ్యక్తుల అవసరాలను తీర్చడంపై సెషన్‌లు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ రాహుల్‌నారంగ్, వైద్యులు బాలాజీ, శ్రీనివాస్, కృష్ణ, నీమ్, నమిత్‌కాంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో లక్ష పుష్పార్చన



శ్రీస్వామి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు లక్ష పుష్పార్చన పూజలు జరిపించారు. పూజలో భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఆకుపూజ నిర్వహించారు. ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను వైభవంగా జరిపించారు.

మార్కెట్ కమిటీ రిజర్వేషన్లు ఖరారు

భువనగిరిటౌన్: జిల్లాలో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో నామినేటెడ్ పదవుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కమిటీల చైర్మన్ పదవుల్లో రిజర్వేషన్ అమలు చేస్తూ కేటగిరీల వారీగా కోటాను ఖరారు చేసింది. గత ప్రభుత్వ హయాంలో కమిటీ గడువు రెండు సంవత్సరాలు ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం దానిని మూడు సంవత్సరాలు పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా ఐదు మార్కెట్లు ఉండగా.. భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ (మహిళ), ఆలేరు ఓసీ (మహిళ), వలిగొండ ఎస్టీ (జనరల్), చౌటుప్పల్ బీసీ (జనరల్), మోత్కూర్ బీసీ (మహిళ)కు రిజర్వేషన్లు కేటాయించింది.

శ్రీలక్ష్మీనారసింహుడికి జిల్లా అడిషనల్ జడ్జి పూజలు



జడ్జి భారతిదేవి, కుటుంబ సభ్యులకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారిని భువనగిరి కోర్టు జిల్లా అడిషనల్ జ డ్జి భారతి దేవి, వారి కుటుంబ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికి, ఆశీర్వచనం చేయగా.. అధికారులు లడ్డూప్రసాదం అందజేశారు.

సమ్మక్క సారలమ్మ జాతరకు సెలవులు ఇవ్వాలి

నల్లగొండ రూరల్: ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా మహాత్మాగాంధీ యూనివర్సిటీకి బుధవారం నుంచి నాలుగు రోజుల (ఈ నెల 21 నుంచి 23 వరకు) పాటు సెలవులు ఇవ్వాలని ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో అశోక్, నవీన్, రమేష్, సంపత్, స్పందన రేఖ, మౌనిక, కావ్య, అంజలి పాల్గొన్నారు.

కమలోత్సాహం

భువనగిరిలో బీజేపీ విజయ సంకల్పయాత్ర

- కాషాయమయంగా మారిన పట్టణ రహదారులు
- జెండా ఊపి యాత్రను ప్రారంభించిన గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్
- ఎల్లమ్మ దేవాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ
- బహిరంగ సభకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు



భువనగిరిలో విజయ సంకల్ప యాత్ర సందర్భంగా నిర్వహించిన సభకు హాజరైన బీజేపీ శ్రేణులు

భువనగిరి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి పట్టణంలో బీజేపీ చేపట్టిన భాగ్యలక్ష్మి విజయ సంకల్పయాత్ర కమలనాథుల్లో నూతనోత్సాహం నింపింది. యాత్రకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ కాషాయమయంగా మారాయి.జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా రాయగిరి వరకు పార్టీ నాయకులు ఫ్లెక్సీలతోపాటు కాషాయ జెండాలు ఏర్పాటు చేశారు. భువనగిరి పట్టణంలోని స్థానిక ఎల్లమ్మ దేవాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌కు ఘన స్వాగతం పలికారు. వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేవైఎం నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం వారికి యాదాద్రి క్షేత్ర లడ్డూ ప్రసాదం అందజేశారు. సభ సందర్భంగా గోవా ముఖ్యమంత్రి సుమారు 15నిమిషాలు ప్రసంగించారు. అనంతరం విజయ సంకల్ప బస్సు యాత్ర(భాగ్యలక్ష్మి క్లస్టర్)ను జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి యాదగిరిగుట్టకు బస్సు యాత్ర వెళ్లింది. సభ ప్రారంభానికి ముందు వేదికపై కళా బృందం ఆటపాటలతో అలరించింది.



గోవా సీఎం ప్రమోద్‌సావంత్, ఈటల రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న బూర నర్సయ్యగౌడ్

సభకు జిల్లాతో పాటు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సభకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరుకావడంతో పాటు వారి ప్రసంగాలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది.

సొంత గూటికి చేరిన నాయకులు

విజయ సంకల్పయాత్ర సభ సందర్భంగా భువనగిరి మున్సిపాలిటీ 12వ వార్డుకు చెందిన ఊదరి లక్ష్మీ సతీష్, 13వ వార్డుకు చెందిన నాయకులు నీలం రమేష్‌లు బీఆర్‌ఎస్ నుంచి తిరిగి సొంత గూటికి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.

మూడు రోజుల పాటు యాత్ర

విజయ సంకల్ప యాత్ర జిల్లాలో మూడు రోజుల పాటు కొనసాగనుంది. భువనగిరిలో ప్రారంభమైన యాత్ర సాయంత్రం పాత బస్టాండ్, రాయగిరి మీదుగా యాదగిరిగుట్ట, అక్కడి నుంచి ఆలేరు, ఆత్మకూర్, రామన్నపేట నుంచి ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల మీదుగా కొనసాగుతుంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి చింతల రామచంద్రారెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా కార్యదర్శి గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, పార్లమెంటరీ ప్రభారీ పాపారావు, ప్రకాష్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు శిల్పారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు చందా మహేందర్ గుప్తా, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షుడు సుర్వి లావణ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, కౌన్సిలర్లు జనగాం కవితా నర్సింహాచారి, రత్నపురం బలరాం, నల్లమాస సుమవెంకటేశ్వర్లు, బొర్ర రాకేష్, బీజేవైఎం నాయకులు శ్రీశైలం, శ్రీధర్, కపిల్, శ్రీను, వివిధ మండలాల, పట్టణాల అధ్యక్షులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న గోవా సీఎం ప్రమోద్ సావంత్, ఈటల రాజేందర్, పాశం భాస్కర్ తదితరులు

గుట్టకు చేరుకున్న బస్సు యాత్ర

యాదగిరిగుట్ట: బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్ర మంగళవారం రాత్రి యాదగిరిగుట్టకు చేరుకుంది. బుధవారం ఉదయం యాదగిరిగుట్ట పట్టణంలో సమావేశం నిర్వహించనున్నారు. మున్నూరుకాపు సత్రం వద్ద మాజీ మంత్రి ఈటల రాజేందర్ ప్రెస్‌మీట్ ఉండనుంది. అనంతరం యాత్ర యాదగిరిగుట్ట మండలం వంగపల్లి మీదుగా ఆలేరు పట్టణానికి చేరుకుంటుంది. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహించి, అనంతరం మోటకొండూర్ మండల కేంద్రం చేరుకొని, అక్కడి నుంచి ఆత్మకూరు(ఎం) మండల కేంద్రం, గుండాల మండల కేంద్రానికి చేరుకుంటుంది. ఆయా మండల కేంద్రాల్లో సభలు, సమావేశాలు నిర్వహించనున్నారు. యాదగిరిగుట్టలో జరిగే కార్యక్రమంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, యాత్ర ప్రముఖ్ భరత్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిరిగె శ్రీనివాస్‌లు పాల్గొంటారని జిల్లా కోశాధికారి కాధూరి అచ్చయ్య తెలిపారు.

‘నల్లగొండ’కు ట్రాన్స్‌పోర్టు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్

- మంజూరు చేయాలని నితిన్ గడ్కరీని కోరిన మంత్రి కోమటిరెడ్డి
- బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లాలో ట్రాన్స్‌పోర్టు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నితిన్ గడ్కరీని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులు, రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం అభివృద్ధి, హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణ తదితర ప్రాజెక్టులపై చర్చించారు. అలాగే నల్లగొండ జిల్లాలో ప్రత్యేకంగా భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు ట్రాన్స్‌పోర్టు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. అలాగే నార్కట్‌పల్లి – అద్దంకి జాతీయ రహదారికి మాచర్లకు వెళ్లే హైవేను అనుసంధానిస్తూ నల్లగొండ పట్టణంలోకి రావాల్సిన అవసరం లేకుండా బైపాస్‌ను మంజూరు చేయాలని వెంకట్‌రెడ్డి కోరారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వరకు విజయవాడ మీదుగా హైస్పీడ్ రైల్ కారిడార్‌ను ఏర్పాటు చేసే సర్వేను త్వరగా చేపట్టాలని కోరారు. ఈ కారిడార్ ఏర్పాటైతే ఉమ్మడి నల్లగొండ జిల్లా మరింత అభివృద్ధికి నోచుకోనుంది.

విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సూర్యాపేట రూరల్: విద్యార్థులు మనోధైర్యంతో ఉండాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. సూర్యాపేట మండలంలోని ఇమాంపేట ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలను మంగళవారం కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబునాయక్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. సమస్యలకు చావే శరణ్యం కాకూడదని, వాటిని టీచర్లకు, తల్లిదండ్రులకు తెలియజేసి పరిష్కరింపజేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు సావిత్రీబాయి, ఫాతీమా బేగంలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థులకు పైలెట్ ప్రాజెక్టుగా సైకియాట్రిస్టులచే తరగతులు నిర్వహించేలా, రెండు కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం అందేలా ప్రభుత్వానికి కమిషన్ సిఫార్సు చేస్తుందన్నారు. ముందుగా ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశమై జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైష్ణవి, అస్మితల తోటి స్నేహితులతో మాట్లాడారు. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై ఒత్తిడి పెంచవద్దని, స్నేహపూర్వకంగా వారిని ప్రోత్సహించాలన్నారు. వైష్ణవి ఇంటికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అస్మిత కుటుంబ సభ్యులను కూడా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఓదార్చారు.

కుల సంఘాలతో సమావేశమైన చైర్మన్, కమిటీ సభ్యులు

షెడ్యూల్డ్ కులాలు అన్ని రంగాల్లో రాణిచ్చేందుకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. గురుకుల పాఠశాల వద్ద కుల సంఘాలతో సమావేశం నిర్వహించారు. అన్ని సంక్షేమ పాఠశాల్లో తాగునీటికి ఆర్‌ఓ ప్లాంట్, నాణ్యమైన ఆహారం అందించాలని, మరుగుదొడ్ల మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం, సీసీ కెమెరాలు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కుల సంఘాల నాయకులు కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ రవి, ఆర్డీఓ కృష్ణయ్య, డీటీడీఓ శంకర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారిణి లత, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఆర్సీఓ అరుణకుమారి, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శ్రీలత, కమిటీ సభ్యులు జ్యోతిపద్మ, ఏఎస్‌డీ ఉమా మహేశ్వరీ, డాక్టర్ అనిల స్రవంతి ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులను స్థానిక మార్కెట్ వసతి గృహంలో కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాహుల్ హెగ్డేలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్.. ప్రభుత్వానికి అందజేసిన ప్రాథమిక నివేదికతో పాటు ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యుల వివరాలను ఇచ్చారు.

పేటలో ఆగని రైళ్లు!



రామన్నపేట రైల్వేస్టేషన్

- రామన్నపేట రైల్వేస్టేషన్‌లో ఆగని నారాయణాద్రి, ఫలక్‌నుమా, రేపల్లె, డెల్టా ప్యాసింజర్ రైళ్లు
- జన్మభూమి ఎక్స్‌ప్రెస్, డెమో రైళ్లను మాత్రమే ఆపుతున్న అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

రామన్నపేట: గత మూడేళ్లుగా రామన్నపేట, వలిగొండ, నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు, రేపల్లె ప్యాసింజర్ రైళ్లు ఆగడం లేదు. దీంతో రామన్నపేట కేంద్రంగా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కరోనా కంటే ముందు సికింద్రాబాద్– తిరుపతి మార్గంలో నడిచే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు, సికింద్రాబాద్–విశాఖపట్టణం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–హౌరా(పశ్చిమబెంగాల్) మధ్య నడిచే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు, మిర్యాలగూడ–కాచిగూడ మధ్య తిరిగే డెమో రైలు, సికింద్రాబాద్–రేపల్లె మధ్య నడిచే రేపల్లె ప్యాసింజర్ రైళ్లు రామన్నపేట స్టేషన్‌లో ఆగేవి. ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారస్థులకు చాలా ఉపయోగకరంగా ఉండేవి. అప్పట్లో నిత్యం 1500మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు.

కరోనా సమయంలో నిలిపివేత..

కరోనా మొదటి వేవ్ సమయంలో రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. అనంతరం రాకపోకలను పునరుద్ధరించిన రైల్వేశాఖ నారాయణాద్రి, ఫలక్‌నుమా, రేపల్లె, డెల్టా ప్యాసింజర్ రైళ్లను రామన్నపేట స్టేషన్‌లో ఆపడం లేదు. కేవలం జన్మభూమి ఎక్స్‌ప్రెస్, డెమో రైళ్లను మాత్రమే ఆపుతున్నారు. హైదరాబాద్, తిరుపతి, చెన్నై, కలకత్తా వంటి నగరాలకు రాకపోకలు సాగించే వ్యాపారులు, హైదరాబాద్ నుంచి వచ్చిపోయే ఉద్యోగులు, చిట్యాల, నార్కట్‌పల్లి, చౌటుప్పల్ ప్రాంతాల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఒడిశా, బెంగాల్, బిహార్, ఏపీకి చెందిన వారు తమ స్వస్థలాలకు వెళ్లి రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. పుణ్యక్షేత్రమైన తిరుపతితో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు 40 కి.మీ దూరంలో ఉన్న నల్లగొండకు వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది. గతంలో మాదిరిగా రైళ్లు ఆపాలని స్థానికులు చేసిన విజ్ఞప్తులను రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

రైలు ప్రయాణం వైపు మొగ్గు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సాగిస్తున్నారు. బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోంది. సీట్లు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రజలు రైలు ప్రయాణం వైపు మొగ్గు చూపుతున్నారు. జన్మభూమి, డెమోలతోపాటు నారాయణాద్రి, ఫలక్‌నుమా, రేపల్లె, డెల్టా రైళ్లను ఆపితే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి



మాది రామన్నపేట. మిర్యాలగూడలో నివాసం ఉంటున్నా. ఇదివరకు మిర్యాలగూడ నుంచి రామన్నపేటకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో ప్రతిరోజూ వచ్చేవాడిని. ప్రస్తుతం రామన్నపేటలో రైలు ఆపడం లేదు. చిట్యాల స్టేషన్‌లో దిగి చిట్యాల బస్‌స్టేషన్‌కు చేరుకొని రామన్నపేటకు రావాల్సి వస్తోంది. గతంలో మాదిరిగా రామన్నపేటలో రైళ్లను ఆపాలి.

– జేవీఎస్ఎస్ మణి, ఉపాధ్యాయుడు, రామన్నపేట

నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి, యాదాద్రి: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్, వీడియో సర్వేలైన్స్, వీడియో వ్యూయింగ్, ఎంసీసీ తదితర అధికారులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల మార్గదర్శకాలు, నియమావళిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. బృందాలకు కేటాయించిన విధులు, నిబంధనలను తప్పకుండా పాటిస్తూ క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించే సమయంలో ముందస్తుగా ఆధారాలు సేకరించాలని, రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనపై ప్రజల నుంచి సీ– విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. పట్టుబడిన డబ్బును సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కాగా.. జిల్లా స్థాయి ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథరెడ్డి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.

వనరులు కాపాడుకోవాలి

సాక్షి,యాదాద్రి: ప్రకృతి వనరులు, భూగర్భ జలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో భూగర్భ జలాల వినియోగం, నియంత్రణ, నిర్వహణపై పారిశ్రామిక, వాణిజ్య వేత్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంత మేరకు భూగర్భ జలాలను వినియోగించుకున్నారో.. అంత పరిమాణంలో వర్షపు నీటిని కృత్రిమ పద్ధతిలో రీచార్జ్ చేసుకోవాలని సూచించారు. – 4శాతం లోటు వర్షపాతంతో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయన్నారు. అనంతరం డిప్యూటీ భూగర్భ జలశాఖ డైరెక్టర్ జ్యోతి కుమార్ జిల్లాలోని భూగర్భజలాల లభ్యత స్థితిగతులపై వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి, హైడ్రోజియాలజిస్ట్ స్వాతిశ్రీ,, అసిస్టెంట్ జియో ఫిజిసిస్ట్ మ్యాథ్యూస్, పీసీబీ అధికారి సబితా బేగం, టీఎస్‌ఐఐసీ అధికారి శ్రీమతి స్వప్న, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైవేపై మేడారం రద్దీ






భువనగిరి మీదుగా మేడారం జాతరకు వెళ్తున్న భక్తులు

- కుటుంబాలతో కలిసి వెళ్తున్న భక్తులు
- నాలుగు రోజుల పాటు మేడారంలో మకాం

సాక్షి,యాదాద్రి: తెలంగాణ మహా కుంభమేళాగా పిలిచే మేడారం జాతరకు భక్తుల ప్రయాణం జోరందుకుంది. ఈనెల 21 నుంచి 24 వరకు సాగే సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్తుండడంతో జిల్లాలోని జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. బీబీనగర్ టోల్‌గేట్ మీదుగా మేడారం వైపు మంగళవారం అత్యధికంగా 35వేల వాహనాలు వెళ్లాయి. జిల్లాలోని పలు గ్రామాల నుంచే కాకుండా హైదరాబాద్ నుంచి వాహనాలు మేడారం వైపు సాగుతున్నాయి. హైదరాబాద్, వరంగల్ జాతీయ రహదారిపై బస్సులు, డీసీఎంలు, లారీలు, టాటా ఏస్‌లపై కుటుంబ సమేతంగా తరలివెళ్తున్నారు. మూడు, నాలుగు రోజులు అక్కడే బస చేసేందుకు సామగ్రి సిద్ధం చేసుకుని వెళ్తున్నారు. మేడారం వెళ్తున్న క్రమంలో భువనగిరి శివారులో ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి బయలుదేరుతున్నారు.

జాతరకు వెళ్తున్నాం



మొక్కు చెల్లింపులో భాగంగా మేడారానికి వెళ్లి అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పించుకుంటాం. అనంతరం అమ్మవారి గద్దెలను దర్శించుకుంటాం. ఎటువంటి కోరికలు ఉన్నా కచ్చితంగా నెరవేరుతాయి. అందుకే ప్రతి రెండేళ్లకు కుటుంబసమేతంగా మేడారానికి వెళ్తాం.

– ఉమాదేవి, జగద్గిరిగుట్ట

నాలుగు రోజులు అక్కడే ఉంటాం



నా చిన్నతనం నుంచి మేడారం జాతరకు వెళ్తుంటాం. కుటుంబ సమేతంగా అక్కడే నాలుగు రోజుల పాటు ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుని వెళ్తాం. ప్రతి రెండు సంవత్సరాలకొకసారి జరిగే జాతరకు వెళ్లే సంతోషంగా ఉంటామని నమ్మకం. – సారయ్య, హైదరాబాద్

క్లుప్తంగా

యాదాద్రీశుడి హుండీ ఆదాయం రూ.1.77కోట్లు



హుండీ నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం కొండ కింద గల సత్యనారాయణస్వామి వ్రత మండపంలో లెక్కించారు. నగదు రూపంలో రూ.1,77,99,734 ఆదాయం వచ్చిందని ఈఓ వెల్లడించారు. మిశ్రమ బంగారం 99గ్రాములు, మిశ్రమ వెండి 4కిలోల 170గ్రాములు లభించిందని పేర్కొన్నారు. అదేవిధంగా వివిధ విదేశాలకు చెందిన కరెన్సీ సైతం వచ్చిందన్నారు. ఈ హుండీ ఆదాయం 22 రోజులదని ఈఓ తెలిపారు.

సైబర్ వలలో యువతి

రామన్నపేట: రెట్టింపు డబ్బులు వస్తాయనే ఆశతో ఓ యువతి ఆన్‌లైన్ పేమెంట్ చేసి మోసపోయింది. ఈ ఘటన మంగళవారం రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన ఓ యువతికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి తాము ఫోన్‌కు పంపించే లింక్‌కు డబ్బులు చెల్లిస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు తిరిగి వస్తాయని ఆశ చూపాడు. ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో ఆ యువతి సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌కు రూ.22,680 పంపించింది. డబ్బుల కోసం తిరిగి ఫోన్ చేస్తే రిప్లై లేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన యువతి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పట్టపగలే చోరీ

దేవరకొండ: దేవరకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద పట్టపగలే ఓ మహిళ బ్యాగులో నుంచి రూ.50వేల నగదుతో పాటు మూడు తులాల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితురాలు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండకు చెందిన కేశబోయిన యాదమ్మ మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లేందుకు గాను చారగొండ నుంచి ఆటోలో బయల్దేరి దేవరకొండకు చేరుకుంది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో దేవరకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద హైదరాబాద్ వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తున్న యాదమ్మ బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు కోసి అందులో ఉన్న రూ.50వేల నగదు, మూడు తులాల బంగారంతో ఉడాయించారు. బస్సు ఎక్కే క్రమంలో తన బ్యాగును కోసిన విషయాన్ని గుర్తించిన యాదమ్మ లబోదిబోమంది. సమాచారం తెలుసుకున్న దేవరకొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

నిందితులకు జైలుశిక్ష

హుజూర్‌నగర్: హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ హుజూర్‌నగర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. చింతలపాలెం మండలం దొండపాడుకు చెందిన ముదిడి రామిరెడ్డి, అదే గ్రామానికి చెందిన గోపిరెడ్డి నాగకృష్ణారెడ్డి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉండడంతో 2017 ఏప్రిల్‌లో రామిరెడ్డి తమ్ముడైన సుబ్బారెడ్డి తన షాపు మూసివేసి ఇంటికి వెళ్తుండగా నాగకృష్ణారెడ్డి, జి. ఓబుల్‌రెడ్డి, పి. వెంకట్‌రెడ్డి దాడిచేసి గాయపరిచారు. సుబ్బారెడ్డి అన్న రామిరెడ్డి చింతలపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఏఎస్‌ఐ నర్సిరెడ్డి నిందితులపై కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్‌ఐ పరమేష్ దర్యాప్తు పూర్తిచేసి నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం హుజూర్‌నగర్ అసిస్టెంట్ సెషన్స్ నిందితులు ఒక్కొక్కరికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ధ్వజారోహణం.. దేవతాహ్వానం

- పాతగుట్టలో రెండో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు
- నేడు ఉదయం అలంకార సేవ, రాత్రి ఎదుర్కోలు ఉత్సవం



ధ్వజ పటాన్ని, స్వామివారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, ఈఓ, అనువంశిక ధర్మకర్త

యాదగిరిగుట్ట: పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహుడి వాహనం అయిన గరుఢ ఆళ్వారుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజ పటాన్ని ధ్వజ స్తంభం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ గరుఢ ఆళ్వారుడికి ఇష్టమైన పదార్థాలను (గరుఢ ముద్దలను) నైవేద్యంగా సమర్పించారు. గరుఢస్వామికి ఇష్టమైన వంటకాల సమర్పణలో అష్టరాగాల ఆలాపన చేసి ధ్వజారోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఉత్సవ వైభవం విశ్వజనులకు చేరిందని ఆచార్యులు తెలిపారు. గరుత్మంతుడికి సమర్పించిన నైవేద్యం ప్రసాదాలను ఆచార్యులు భక్తులు, నిర్వాహకులకు అందజేశారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, ఆచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

సాయంకాలం దేవతాహ్వానం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యారాధనల అనంతరం వేదపారాయణీకులచే వేదపారాయణం, మూలమంత్ర, అనుష్టానములు గావించారు. అనంతరం సాయంత్రం భేరీపూజ, దేవతాహ్వానం నిర్వహించారు. శబ్దం భగవంతుని స్వరూపం కనుక శబ్దనాములతో భగవానుని ఆరాధించుట ఈ వేడుకలోని ప్రత్యేక అని ఆచార్యులు పేర్కొన్నారు.



ధ్వజ పటానికి పూజలు చేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

నేడు అలంకార సేవ.. ఎదుర్కోలు ఉత్సవం

నృసింహుడికి ఇష్టమైన అలంకార సేవలు బుధవారం ప్రారంభం కానున్నాయి. అలంకార ప్రియుడైన శ్రీనృసింహుడికి బుధవారం ఉదయం హవన పూజలు జరిపించిన తర్వాత సింహ వాహనంపై అలంకరించి తిరువీధుల్లో సేవ నిర్వహిస్తారు. రాత్రి స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామివారు అశ్వవాహనంపై ఊరేగుతూ తిరువీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



పాతగుట్ట ఆలయంలో భేరీ పూజ, దేవతాహ్వాన పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు

చెర్వుగట్టులో ఘనంగా దోపోత్సవం



దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున దోపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, ఉప ప్రధానార్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాలతో దోపోత్సవం, మహా బలిహారణ, మహా పూర్ణాహుతి, హోమం, ధ్వజారోహణం, ఏకదశ రుద్రాభిషేకం, జ్యోతి లింగార్చన, ఏకాంతసేవ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శంకర్, రవీందర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరెడ్డి, రాజయ్య, వెంకటయ్య, వంశీధర్‌రావు, రాజలక్ష్మి, మహేందర్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ ఆర్ఐ సురేందర్‌సింగ్

మిర్యాలగూడ: విశ్వసనీయ సమాచారం మేరకు మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామానికి చెందిన జిల్లా భిక్షం ఇంట్లో నిల్వ చేసిన 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ సతీష్‌వర్మ తెలిపారు. అదేవిధంగా మిర్యాలగూడ మండలంలోని దొండవారిగూడెం గ్రామానికి చెందిన కటికర్ల వెంకయ్య తన ఇంట్లో నిల్వ చేసిన 23.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల నుంచి రూ.15కు పీడీఎస్ బియ్య కొనుగోలు చేసి రూ.18కి అమ్ముకుంటున్నట్లు జిల్లా భిక్షం సివిల్ సప్లయ్ అధికారులకు తెలిపాడు. పట్టుబడిన బియ్యాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు భిక్షం, వెంకయ్యపై కేసులు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ ఆర్ఐ సురేందర్‌సింగ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన చిర్రబోయిన నరేష్ సోమవారం బైక్‌పై నాగారం వచ్చి తిరిగి తిరుమలగిరికి వెళ్తుండగా.. ఫణిగిరి గ్రామ శివారులో సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ట్రాలీ ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరేష్ ఎగిరి రోడ్డుపై పడిపోవడంతో అతడి తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నరేష్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి చిర్రబోయిన యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.



నరేష్ (ఫైల్)

ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈఈ

హుజూర్‌నగర్: గ్రామ పంచాయతీలో చేపట్టిన విద్యుత్ పనులకు సంబంధించిన వివరాలను మెజర్‌మెంట్ బుక్(ఎంబీ)లో రికార్డు చేసేందుకు గాను మేళ్లచెరువు మండల పంచాయతీరాజ్ ఏఈఈ కోసూరి రంగరాజు లంచం తీసుకుంటుండగా మంగళవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఎంవీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలం కప్పలకుంటతండాకు చెందిన ధరావత్ కృష్ణ కప్పకుంటతండా, దుబ్బతండా, శివబాలాజీనగర్ తండాల్లో ఎల్ఈడీ(9 వాట్లు, 40 వాట్లు) బల్బులు ఏర్పాటు చేశాడు. వాటికి సంబంధించిన వివరాలను ఎంబీలో రికార్డు చేయాలని పంచాయతీరాజ్ ఏఈఈ కోసూరి రంగరాజును కోరగా అతడు లంచం డిమాండ్ చేశాడు. దీంతో కృష్ణ ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు సోమవారం సాయంత్రం కృష్ణ హుజూర్‌నగర్‌లోని పంచాయతీరాజ్ డివిజనల్ కార్యాలయంలో ఏఈఈ రంగరాజుకు రూ.5వేలు లంచం ఇస్తుండగా పట్టుకున్నారు. ఏఈఈని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు బి. రామారావు, బి. వెంకటరావు ఉన్నారు.



ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీరాజ్ ఏఈఈ రంగరాజు

లంచం అడిగితే ఏసీబీకి తెలపాలి

ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఏసీబీకి తెలపాలి ఏసీబీ డీఎస్పీ ఎంవీ శ్రీనివాసరావు అన్నారు. లంచం అడిగిన వారి వివరాలను 9154388918 నంబర్‌కు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

గెజిటెడ్ అసోసియేషన్ అడ్వైజరీ మెంబర్‌గా పురుషోత్తంరెడ్డి



పురుషోత్తంరెడ్డి

రామన్నపేట : తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అసోసియేషన్ అడ్వైజరీ మెంబర్‌గా రామన్నపేట ఎస్టీఓ గంగుల పురుషోత్తంరెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి స్థానికంగా మాట్లాడారు. మెరుగైన పీఆర్‌సీ, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం విడుదల కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



పట్టుబడిన నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కోదాదరూరల్: కోదాడ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు యువకులను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. కోదాడ ఎక్సైజ్ సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్నరనే సమాచారం మేరకు సూర్యాపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో మంగళవారం కోదాడ పట్టణంలోని ఖమ్మంక్రాస్‌రోడ్, బొబ్బలమ్మగుట్ట, విష్ణురామ్ థియేటర్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో కోదాడ పట్టణానికి చెందిన దీకుంట్ల ఉపేందర్, చిన్నపంగు అభిలాష్, షేక్ మతీన్, బి. నవీన్‌రెడ్డి, నవీన్, నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన బెల్లంకొండ వినయ్ అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వాహనాలను తనిఖీ చేయగా 620 గ్రాముల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన యువకుల నుండి ఒక కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు రామకృష్ణ, యాదయ్య, గోవర్దన్, సిబ్బంది శ్రీనివాస్, నాగయ్య, ఉదయ్, రాము ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కూల్చివేతలను పర్యవేక్షిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం చైర్మన్ శేఖర్‌రెడ్డి, అధికారులు

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో 113 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను మంగళవారం మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ బృందం కూల్చివేసింది. టాస్క్‌ఫోర్స్ బృందం చైర్మన్, స్థానిక ఆర్డీఓ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఈ దాడుల్లో పాల్గొన్నాయి. తెల్లవారుజామునే అక్కడకు చేరుకున్న అధికారులు, సిబ్బంది.. జేసీబీ యంత్రాల సాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇటీవల 113 సర్వేనంబర్‌లో సర్వే నిర్వహించగా 0.36ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఇది ఇతరుల ఆక్రమణలో ఉన్నట్లుగా తేలడంతో అదేరోజు హద్దులు నిర్ణయించారు. అప్పటి ఆర్డీఓ జగన్నాథరావు ఆధ్వర్యంలో సదరు వ్యక్తులకు విషయాన్ని తెలియజేసి స్థలాన్ని అప్పగించాలని సూచించారు. వారు స్థలాన్ని వదిలేయకపోవడంతోపాటు అక్రమ నిర్మాణాలను తొలగించకపోవడంతో ఇటీవల స్థానికుల నుంచి ఉన్నతాధికారులకు వరుస ఫిర్యాదు అందాయి. స్పందించిన కలెక్టర్ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని టాస్క్‌ఫోర్స్ టీంను ఆదేశించారు. అందులో భాగంగా తహసీల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్, సీఐ అశోక్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు, సర్వేయర్ మురళీధరన్‌లతోపాటు ఆయా శాఖల సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పోలీస్ బందోబస్తు నడుమ జేసీబీల సాయంతో నిర్మాణాలను కూల్చివేశారు. హద్దులు వేసి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు. ఇదిలా ఉండగా.. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా, ముందస్తు నోటీసులు అందజేయకుండా కూల్చివేయడం సమంజసం కాదని ఆకుల శ్రీకాంత్, సుర్వి అంజయ్య తెలిపారు. దీనిపై ఆర్డీఓ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో వేసిన కొలతల మేరకు హద్దులు నిర్ణయించామని పేర్కొన్నారు. పట్టాభూమి వరకే కాకుండా ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో కూల్చివేశామని చెప్పారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులకు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఉండదని తెలిపారు.

రోడ్డు ప్రమాదం.. ఎస్‌ఐకి గాయాలు

పెన్‌పహాడ్: మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామ పంచాయతీ శివారులో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గరిడేపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గరిడేపల్లిలో విధులు ముగించుకొని ఎస్‌ఐ సైదులు తన సొంత కారులో సూర్యాపేటకు వెళ్తుండగా.. కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ గేట్ వాల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎస్‌ఐకి చేయి విరగడంతో పాటు గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4 నెలల కాలపరిమితి కల్గిన ఈ కోర్సుకు పదో తరగతి పాసై లేదా ఐటీఐ విద్యార్హత కల్గి ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కల్గి ఉండాలన్నారు. ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థులకు ప్రాధాన్యత కల్పించబడుతుందని తెలిపారు. ఆసక్తి కల్గిన వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మార్చి 1న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పించబడుతుందని అన్నారు. వివరాలకు 9848908059, 9133908000 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు బ్యూటీషియన్ కోర్సుకు కౌన్సిలింగ్..

నిరుద్యోగ యువతులకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు గాను బుధవారం ఉదయం 10గంటల నుంచి స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2 నెలల కాలపరిమితి కల్గిన ఈ కోర్సుకు పదో తరగతి పాసై ఉండి, 18 నుంచి 30ఏళ్ల వయస్సు కల్గి ఉండాలన్నారు. ఆసక్తి కల్గినవారు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో నేరుగా కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి నెలకు రూ.3వేల ఫీజుతో హాస్టల్ వసతి కల్పించబడుతుందని అన్నారు. పూర్తి వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ సరిగా జరగలేదు

- మానవ హక్కుల వేదిక నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నంద్యాల హరీందర్



మాట్లాడుతున్న హరీందర్

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలో ఏర్పాటు చేస్తున్న యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద మంగళవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ సరిగా జరగలేదని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు నంద్యాల హరీందర్ అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుండగా ఆయన ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేశారు. అభిప్రాయ సేకరణలో తను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా కలెక్టర్ చొరవ తీసుకుని మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయ సేకరణలో కాపీ రైట్స్ ఉల్లంఘన జరిగిందన్నారు. దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న డెక్కన్ క్రోమైట్ వ్యర్థాలు 20 ఏళ్లుగా తొలగించడం లేదని, వర్షాలు పడ్డ ప్రతిసారి మూసీ నది ద్వారా ఆ వ్యర్థాలను కృష్ణా నదిలో కలుపుతున్నారన్నారు. అదేవిధంగా ఈ థర్మల్ విద్యుత్ ప్లాంట్ ద్వారా వెలువడే బూడిద నిమిషానికి పది టన్నులు వస్తుందని దాన్ని ఎక్కడ వేస్తారని ప్రశ్నించారు. ఈ థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కోసం దామరచర్ల మండలంలో 4వేల ఎకరాల అటవీ భూమిని సేకరించారని, దానికి బదులుగా దేవరకొండ సమీపంలో కొంత భూమి సేకరించి అడవి సృష్టించాలని అనుకున్నారని, కానీ డిండి ఎత్తిపోతల పథకం ద్వారా కిష్టరాయిన్‌పల్లి రిజర్వాయర్ నింపితే ఆ సేకరించిన భూములు ముంపు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

లారీని ఢీకొట్టిన కారు.. ఆరుగురికి గాయాలు



లారీ వెనుక ఇరుక్కుపోయిన కారు

చౌటుప్పల్: ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ పంచాయతీ మదిర బొర్రోళ్లగూడెం గ్రామం వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా పోలవరం గ్రామానికి చెందిన నరేష్, మహేందర్ స్నేహితులు. నరేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా.. మహేందర్ వ్యాపారం చేస్తున్నాడు. వీరు మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లిలో నివాసముంటున్నారు. వీరు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి కారులో వెళ్లి సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పంచాయతీ మదిర బొర్రోళ్లగూడెం వద్దకు రాగానే విజయవాడ–హైదరాబాద్ హైవేపై వీరి కారు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మహేందర్, అతడి భార్య దివ్య, కుమారుడు భార్గవ్‌రావుతో పాటు నరేష్, అతడి భార్య మౌనిక, కుమార్తె నిఖిత గాయపడ్డారు. ప్రమాద జరిగిన సమయంలో అక్కడికి సమీపంలోనే పెట్రోలింగ్ పోలీసులు ఉండడంతో గమనించి వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యతోనే మహిళలకు సామాజిక హోదా



ఆన్‌లైన్‌లో ప్రధాని ప్రసంగాన్ని వింటున్న యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు

ఎంజీ యూనివర్సిటీ (నల్లగొండ రూరల్) : విద్యతోనే మహిళలకు సామాజిక హోదా పెరుగుతుందని భారత ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మంగళవారం యూనివర్సిటీలో ఉషాశిక్ష అభియాన్ కింద రూ.20కోట్ల నిధులను యూనివర్సిటీకి ప్రకటించిన నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా ప్రధాని ప్రారంభించి మాట్లాడారు. యూనివర్సిటీలో వసతులు కల్పించడంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రధాని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో మహిళలకు వసతులు కల్పించేందుకు ప్రాధాన్యం ఇచ్చినట్లు విద్యార్థులకు తెలిపారు. అనంతరం వీసీ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం మహాత్మాగాంధీ యూనివర్సిటీకి రూ.20కోట్ల గ్రాంటు ప్రకటించడం పట్ల ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. నిధులతో యూనివర్సిటీలో మెరుగైన విద్యను అందించడంతో పాటు అన్ని సౌకర్యాలను కల్పించి దేశ వ్యాప్తంగా యూనివర్సిటీ విద్యార్థులు పోటీపడేలా సన్నద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, పాలక మండలి సభ్యులు బోయపల్లి కృష్ణారెడ్డి, అధ్యాపకులు లక్ష్మి, అరుణప్రియ, ప్రేమ్‌సాగర్, మద్దిలేటి, సురేష్‌రెడ్డి, ప్రశాంతి పాల్గొన్నారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండటౌన్ : తెలంగాణ రాష్ట్రంలో బీసీల కులగణన చేపట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అసెంబ్లీలో ప్రకటించడం చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బీసీ కులాల గణన చేయాలని దశాబ్దకాలంగా పోరాటం చేస్తున్నామన్నారు. ఢిల్లీలో జరిగిన ఉద్యమం సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తాము అధికారంలోకి వస్తే బీసీ కులాల గణన చేయిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రకటించడం హర్షణీయమన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేయాలని నిర్ణయించడంతో త్వరలో హైదరాబాద్‌లో పెద్దఎత్తున కృతజ్ఞత సభ నిర్వహించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. పదేళ్లగా బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను పట్టించుకోక పోగా అధికారం కోల్పోయిన వెంటనే కపట ప్రేమను ఒలకబోస్తోందని విమర్శించారు. ఆయన వెంట సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కాశయ్యగౌడ్, విశ్వనాథం ఉన్నారు.

పిలాయిపల్లి కాలువలో కాలుష్యపు నురగలు



మైసమ్మ కత్వ వద్ద కాలువలో పేరుకుపోయిన కాలుష్యపు నురగలు



కాలుష్యపు నురగలతో పారుతున్న పిలాయిపల్లి కాలువ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పిలాయిపల్లి కాలువ ద్వారా పారుతున్న సాగునీరు కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నీరు వివిధ రసాయనాల వాసనను వెదజల్లుతూ తెల్లటి నురగలను కక్కుతుంది. మండల శివారులోని మైసమ్మకత్వ సమీపంలో నెల రోజులుగా సాగునీరు నురగలతో ప్రవహిస్తుంది. అంతే కాకుండా కొందరూ అక్రమార్కులు పలు పారిశ్రామిక వాడల నుంచి వ్యర్థ రసాయనాలను ట్యాంకర్లలో రాత్రివేళలో ఇక్కడికి తీసుకొచ్చి పిలాయిపల్లి కాలువలో వదులుతున్నారు. ఇటీవల మండలంలో పలు ట్యాంకర్లను ప్రజలు పట్టుకొని పోలీసులకు అప్పగించగా కేసులు నమోదు చేశారు. అయినా ఈ దందా ఆగడం లేదు. కాగా ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేస్తామని ప్రకటించి బడ్జెట్‌లో రూ.1000కోట్లు కేటాయించింది. కాని మూసీ ప్రక్షాళన కార్యరూపం దాల్చినపుడే మండల ప్రజలకు కాలుష్యం నుంచి విముక్తి లభించనుంది.